క్లుప్తంగా

సురక్షతో ఇంటి వద్దకే వైద్యసేవలు



రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కౌతాళం: ఆరోగ్య సురక్షతో ప్రజల ఇంటివద్దకే వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని చూడిలో ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్, హిమోగ్లోబిన్, మలేరియా, టీబీ, డెంగీ, యూరిన్ టెస్ట్, ఈసీజీ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా చేయిపట్టుకుని నడిపించే కార్యక్రమాన్ని ఆరోగ్య సురక్ష ద్వారా చేపడుతున్నామని తెలిపారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆయా కుటుంబాల వారికి ఏదైనా అనారోగ్యం వస్తే రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ఏపీఆర్‌జేసీ కౌన్సెలింగ్

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 20 నుంచి బనవాసి ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి కౌన్సిలింగ్ ఉంటుందని రాయలసీమ రీజియన్ (బాలికల) కన్వీనర్ డాక్టర్ జె.శ్రీనివాసగుప్త తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాల నుంచి ఇంటర్మీడియెట్ ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు aprs.apcfss.in వెబ్‌సైట్ నుంచి కాల్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బనవాసి ఏపీఆర్‌జేసీ కాలేజీలో ఈ నెల 20వ తేదీన ఎంపీసీ విద్యార్థులకు, 21న బైపీసీ విద్యార్థులకు, 22న ఎంఈసీ/సీఈసీ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అలాగే ఏపీఆర్‌జేసీ (ఎంజీ) వాయిల్పాడు కాలేజీకి చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోటాను ఈ కౌన్సిలింగ్‌లో భర్తీ చేస్తామని చెప్పారు. ఏపీఆర్‌జేసీ (సీఈ) నిమ్మకూరులోని ఈఈటీ, సీజీడీటీ రాయలసీమ కోటాను కూడా బనవాసి సెంటర్‌లోనే భర్తీ చేస్తున్నామని తెలిపారు. కౌన్సిలింగ్‌లో 1:5 చొప్పున విద్యార్థినుల ఎంపిక ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

20 నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీ

ఆదోని రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో ఈనెల 20వ తేదీ నుంచి రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆదోని మండలానికి ఖరీఫ్ సీజన్‌కు 1010 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో రైతులకు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. సోమవారం నుంచి గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో రైతులు విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. అలాగే 1500 క్వింటాళ్ల విత్తనాలు అదనంగా అవసరమవుతాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. 160 క్వింటాళ్ల కంది విత్తనాలు, 5 క్వింటాళ్ల కొర్ర విత్తనాలు, 5 క్వింటాళ్ల జీలుగ, 1.5 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలను మండలానికి ఇప్పటికే కేటాయించడం జరిగిందన్నారు. రైతులు సోమవారం నుంచి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని సూచించారు.

వలస వెళ్లిన బాలుడి హత్య

బనశంకరి: వలస కూలీ దంపతుల కుమారుడిని గుర్తుతెలియని దుండగులు కర్రలతో కొట్టి హత్య చేశారు. ఈ ఘటన బెంగళూరు సర్జాపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు.. కర్నూలు జిల్లా మంత్రాలయానికి చెందిన కూలీ దంపతులు, కుమారుడు ప్రాణేశ్ (15)తో కలిసి మూడు నెలల క్రితం ఉపాధి కోసం బెంగళూరు శివార్లలోని ఆనేకల్ తాలూకా నరిగా గ్రామానికి చేరుకున్నారు. 15వ తేదీన బాలుడు బహిర్భూమికి వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగులు కర్రలతో అతని తల, ఇతర భాగాలపై దాడి చేయడంతో అక్కడికక్కడే చనిపోయాడు. సాయంత్రం పనుల నుంచి వచ్చి బాలుడిని వెతుకుతూ వెళ్లిన తల్లిదండ్రులు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ ఘటనపై సర్జాపుర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం పాలపళ్ల వృషభాలు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వృషభాల యజమానులు ఉదయం 8 గంటలలోపు రూ.500లు ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20 వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు. వివరాలకు 9390236459, 8317575504, 9704458065 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం

- ఫలితాలను బట్టి ఎరువుల వినియోగంతో ఖర్చు తగ్గుముఖం
- అధిక దిగుబడులకు అవకాశం
- బనవాసి కేవీకేలో భూసార, నీటి పరీక్షలు



బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)



పొలాల్లో మట్టి సేకరించే విధానాన్ని వివరిస్తున్న అధికారులు (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పుల్ని ఎప్పటికప్పుడు కనిపెట్టి తగిన ఎరువులు వాడుతూ వ్యవసాయం చేస్తేనే మంచి పంటలు పండించవచ్చు. వ్యవసాయ పనుల్లో భూసార పరీక్షలు చేయించడం అతి ప్రధానమైనది, ముఖ్యమైనది కూడా. పరీక్ష ఫలితాన్ని అనుసరించి అనువైన పంటలను వేసుకోవాలి. రైతులు అనువైన సమయంలోనే స్పందించి భూసార పరీక్షలు చేయించుకోవడం ప్రయోజనకరం. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు నేలను చదును చేసుకోవడం, పొలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలను తొలగించడం వంటి పనులు మొదలుపెట్టారు. ఇంతకంటే అతి ముఖ్యమైన వ్యవసాయ ప్రక్రియ భూసార పరీక్షలు చేయించడం మరువరాదు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలు చేస్తున్నారు. అలాగే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నారు. మట్టి నమూనాల సేకరణపై ఆర్‌బీకేల్లో వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

రైతుల్లో అవగాహన లోపం

భూసార పరీక్షలపై రైతులు ఎలాంటి సలహాలు, సూచనలు పొందకుండా ఇష్టానుసారంగా పంటలు సాగుచేయడం, క్రిమిసంహారక మందులు వాడటం, అధిక ఎరువుల వాడకం వంటి కారణాల వల్ల పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. భూమిలో ఎంత శాతం ఏఏ లవణాలు, మూలకాలు, ఖనిజాలు ఉన్నాయో తెలియకుండా ఇష్టానుసారంగా పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నారు.

మట్టి నమూనా సేకరించే విధానం

- మట్టి నమూనా తీయవలసిన చోట చెత్తా, చెదారం లేకుండా పక్కకు తీసివేయాలి. నాగలి సాలు పోవునంత లోతువరకు లేదా 6 అంగుళాలు లోతు వరకు 'వి' ఆకారంలో తవ్వాలి.
- సేకరించిన మట్టి నమూనాను శుభ్రమైన సంచి లేక గోనె సంచిపైన పోసి కలపాలి. 10–15 స్థలాల నుంచి మట్టిని అరకిలో చొప్పున సేకరించి మొత్తం కలపాలి.
- కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు మొదలైన వాటిని తీసివేయాలి. మట్టి తడిగా ఉంటే ఆరబెట్టాలి
- కలిపిన మట్టిని 4 భాగాలుగా విడదీయాలి. ఈ భాగాల్లో ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతా రెండు భాగాలను తీసివేయాలి. ఇలా చేస్తూ చివరగా అరకిలో మట్టి నమూనా వచ్చేలా చేయాలి. ఈ మట్టిని శుభ్రమైన గుడ్డ సంచిలో గాని, పాలిథిన్ సంచిలోగాని నింపాలి. ఈ ప్యాకెట్‌లోపల నమూనా వివరాలుగల సమాచార పత్రం ఉంచాలి.
- సమాచార పత్రంలో రైతు పూర్తి పేరు, తండ్రి పేరు, చిరునామా, పొలం పేరు, సర్వే నంబర్, ఎంత భూమి, మెట్ట లేదా నీటి పారుదల లేదా ఆరుతడి గత 3 సంవత్సరాలుగా వేసిన పైరుకు వాడిన ఎరువులు, పంట దిగుబడి వివరాలు, సాగు చేసే పంట వివరాలను రాయాలి. సేకరించిన మట్టి నమూనాలను వ్యవసాయ అధికారి ద్వారా సమీపంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.

పీహెచ్ మీటర్ (ఉదజని సూచిక)

నల్ల చౌడు నేల, ఆమ్ల నేలను ఈ మీటర్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. వాటిలో చౌడు శాతం పెరుగుతున్నాయి. వీటిని నివారించడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి. ముఖ్యంగా జీలుగ విత్తనాలు వల్ల నల్ల చౌడు పోతుంది.

కండక్టివ్ మీటర్

ఉప్పు నేలలను తెలుసుకోవడానికి ఈ మీటర్‌ను ఉపయోగిస్తారు. పొలాల్లో తెల్లగా పేరుకుపోయి ఉంటుంది. ఎక్కడైతే 1 శాతం కన్నా ఎక్కువ ఉంటే పొలాన్ని బాగా దున్నేసి ఒక రోజు వరకు నీటిని నిల్వ చేయాలి.

నీటి పరీక్ష

వ్యవసాయ సాగుకు నీరు చాలా ముఖ్యం వీటిలో ఉప్పు నీళ్లు, చౌడు నీళ్లు ఉంటాయి. చౌడు నీళ్లను పొలం తట్టుకోదు. నీళ్లు పారే కాలువలో జిప్సం 10 కిలోలు చొప్పున రెండు చోట్ల వేయాలి. నీళ్లు దుంకేచోటగానీ, ట్యాంకులోగానీ వేయవచ్చు. కొత్త బోరు, పాత బోరు, బావులలోని నీటిని పరీక్ష చేయించుకోవచ్చు. అలాగే నీళ్లలో చౌడు శాతం ఎక్కువగా ఉండే పొలం పాడైపోతుంది. చౌడుకు తట్టుకునే పంటలు వరి, పత్తి, పొద్దుతిరుగుడు, ఆముదం, రాగులు, జొన్నలను సాగు చేసుకోవచ్చు.

ఆ తర్వాత నీళ్లను బయటకు పంపివేయాలి.

భాస్వరం

నేలలో భాస్వరం ఎంతమేర ఉందో తెలుసుకోవడానికి కలోరి మీటర్‌ను ఉపయోగిస్తారు. ముఖ్యంగా వరి, మిరప, ఉల్లి, ఇతర కూరగాయలు పంటలకు 30 బస్తాల వరకు రసాయన ఎరువులు ఉపయోగిస్తే అటువంటి నేలలో ఎకరాకు 24 కిలోల కన్నా ఎక్కువ భాస్వరం ఉన్నట్లయితే బాగుంటుందని చెప్పవచ్చు. ఒక వేళ ఎకరాకు 150 కిలోల భాస్వరం కంటే ఎక్కువ ఉంటే మొక్కకు జింక్, ఇనుము అందకుండా చేస్తాయి. పంట పండక ముందే ఎర్రగా వస్తుంది. అటువంటి సమయంలో భాస్వరం పైపాటుగా కాంప్లెక్స్, డీఏపీ ఎరువులుగానీ పైపాటుగా వేయకూడదు. ప్రారంభంలో దుక్కిలో కొంత భాస్వరం వేసుకోవచ్చు.

పోటాష్

నేలలో పోటాష్‌ను ఫ్లేంఫోటోమీటర్ పరికరంతో తెలుసుకోవచ్చు. పోటాష్ ఉండే ఎరువులు బయటి మార్కెట్‌లో దొరకడం లేదు. ప్రతి రైతు ఆరుతడి, తడి పైర్లకు ఎకరాకు 50 కిలోల పోటాష్‌ను వాడవచ్చు. వర్షాధారం కింద పొలాలకు ఎకరాకు 25 కిలోల పోటాష్‌ను ఉపయోగించవచ్చు.

భూసార పరీక్షలపై అవగాహన పెరగాలి



భూసార పరీక్షలపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టినమూనా పరీక్షలు లేకుండా పంట సాగు చేస్తే నష్టాలు తప్పా మరొకటి ఉండదు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు చేస్తున్నాం. మట్టి పరీక్షకు రూ.100 (ఒక శాంపిల్‌కు), నీటి పరీక్షకు రూ.60 (ఒక శాంపిల్‌కు) ఖర్చవుతుంది. మట్టి, నీటి శాంపిల్స్ సేకరణలో ఏమైన సందేహాలుంటే 80741 43694 (సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ప్రోగాం అసిస్టెంట్) నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

–అశోక్, కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, బనవాసి

సూక్ష్మ పోషకాల లభ్యత

నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్, కాపర్ వంటివి తప్పనిసరిగా కావాలి. వీటిని తెలుసుకోవడం కోసం అటామిక్ అబ్జాప్షన్ స్పెక్ట్రోఫోటో మీటర్ పరికరాన్ని ఉపయోగిస్తారు. ఈ పరికరం ఎమ్మిగనూరు, కర్నూలు, డోన్ కేంద్రాల్లో ఉంది. జిల్లాలో 70 శాతం వరకు పొలాల్లో జింక్, ఇనుముగానీ తక్కువగా ఉంటాయి. వీటిని అధికారులు సూచనల మేరకు పొలాల్లో ఉపయోగించాలి.

మండలాభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభావతి

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ ప్రభావతి సభ్యులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభం కానుందని, గ్రామాల్లో తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించి , బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సర్పంచ్‌లను ఆదేశించారు. కోసిగిలో పులికనుమ రిజర్వాయర్ సమీపంలో 4 బోర్లు వేయించి భూగేని చెరువు వరకు పైప్‌లైన్ వేయించి తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. జలజీవన్ మిషన్ కింద ఏర్పాటు చేసిన ఇంటింటి కులాయిలకు బిల్లులు మంజూరు చేయించాలని నేలకోసిగి సర్పంచ్ హనుమంతమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీటిని కాచి వడబోసి తాగాలని హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు సూచించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఖరీఫ్‌లో విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలని, అన్ని వివరాలు సరిచూసుకొని బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని ఏఈ రాజు సూచించారు. ఈ నెలాఖరుకు ఆర్బీకేల్లో 210 క్వింటాళ్ల వేరుశెనగ, 10 క్వింటాళ్ల జీలుగ, 10 క్వింటాళ్ల కంది విత్తనాలను గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యుత్ స్తంభాలు లేని చోట కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అలాగే తాగునీరు, పారిశుధ్యంపై దృష్టి సారించాలని పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డికి సూచించారు. కోఆప్షన్ మెంబర్ షౌకత్ అలీ, ఆర్‌ఐ శ్రీరాములు, ఏపీఎం సత్యమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు



శంకర్‌నగర్‌లో అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

ఆదోని సెంట్రల్: అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి అన్నారు. ప్రపంచ హైపర్ టెన్షన్ డే పురస్కరించుకుని పట్టణంలోని శంకర్‌నగర్ పీహెచ్‌సీ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బీపీపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలికి అనుగుణంగా బీపీ కేసులు నానాటికి పెరుగుతున్నాయన్నారు. పట్టణంలోని శంకర్‌నగర్‌లో 30,700 మంది జనభా ఉండగా అందులో 3500 మంది బీపీ బాధితులు ఉన్నారని తెలిపారు. పట్టణంలో 6 అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో 20 వేల దాక బీపీతో బాధ పడుతున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలో 15 శాతం మంది బీపీ మాత్రలను వాడుతున్నట్లు చెప్పారు. దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, ఆందోళన తదితర కారణాలతో వచ్చే బీపీని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఉద్యోగులు, వ్యాపారస్తులు నిత్యం పని ఒత్తిడితో టెన్షన్ పడడం, ఇక ప్రైవేట్ ఉద్యోగులు తమ లక్ష్యాలను సాధించేందుకు అదనంగా కష్ట పడుతుండడం, నిద్రలేని రాత్రులు గడపడం ఇవన్నీ హైబీపీకి కారణం అవుతున్నాయన్నారు. దీనికి తోడు కల్తీ ఆహార పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని చెప్పారు. రక్తపోటు బారిన పడిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మద్యం, సిగరెట్ అలవాటు మానుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, కొవ్వు పదార్థాలను ఎక్కువగా తినరాదన్నారు. బరువు నియంత్రణలో ఉంచుకోవాలని, ఆహారంలో ఉప్పును తగిన మోతాదులో తీసుకోవాలని సూచించారు. అనంతరం రక్తపోటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. డాక్టర్ హర్షిక హెల్త్ సూపర్‌వైజర్లు మేరీ, జ్ఞానేశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివిధ వ్యాపార హక్కుల కోసం శుక్రవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించారు. పలువురు సీల్డ్ టెండర్లు దాఖలు చేయగా ఇందులో స్వామి వారికి శేషవస్త్రాల సప్‌లైకోసం ఆదోని అపూర్వ శారీస్, సుస్మిత శారీస్ వారు టెండర్ వేశారు. అలాగే వంటచెరుకు సప్‌లైకోసం కోసిగి మల్లికార్జున సామిల్, ఆదోని విశ్వకర్మ టింబర్ డిపో వారు టెండరు దాఖలు చేయడంతో వీటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అలాగే దేవస్థానం భూములను ఏడాది పాటు కౌలుకు సాగుచేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. సర్వే నంబరు 386లోని 1.58 ఎకరాలను రూ.5700లకు నర్సన్న, సర్వే నెంబరు 131లోని 2.67 ఎకరాలను రూ.25,100కు రామన్నగౌడ్, సర్వే నంబరు 315లోని 1.13 ఎకరాలను రూ.4 వేలకు ఉసేని దక్కించుకున్నారు. ఆదోని మండలం పెద్దహరివాణం సర్వే నంబరు 634లోని ఒక ఎకరాకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఆదోని గ్రూప్ టెంపుల్స్ ఈఓ రాంప్రసాద్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా జడ్జి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి

పత్తికొండ రూరల్ : పత్తికొండ సబ్‌జైల్‌ను శుక్రవారం సాయంత్రం కర్నూలు 6వ అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి తనిఖీ చేశారు. జిల్లా జడ్జి వెంట పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి ఎంఎస్.భారతి ఉన్నారు. ఈసందర్భంగా రిమాండ్‌లోఉన్న ఖైదీలతో మాట్లాడి వారికి జైల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి జిల్లా జడ్జి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖైదీలకు అన్నిసౌకర్యాలు కల్పించాలని సూపరిండెంట్ చంద్రమోహన్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా జడ్జి సాయిబాబా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ క్లర్క్ రమణమ్మ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపైనే చర్చ

- ఏ టీ కొట్టు వద్ద చూసినా ఇవే ముచ్చట్లు
- గెలుపోటములపైనే సమీక్షలు
- ఏ మాత్రం బయటపడని ఓటర్ల నాడి

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసి ఐదు రోజులవుతోంది. మండలంలో టీ కొట్లు, ప్రధాన కూడళ్లు ఇప్పుడు రాజకీయ చర్చలకు వేదికలుగా మారాయి. ఎన్నికల ముందు వరకు గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో అభ్యర్థులు ప్రచార రథాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలతో వీధుల్లో తిరుగుతూ హోరెత్తించారు. ఎన్నికల ముందు రోజు రాత్రి పంపకాలపై చర్చ జరిగింది. పోలింగ్ ముగియడంతో కార్యకర్తలు, గల్లీ లీడర్లు గెలుపోటములపై పందేలకు దిగుతూ బేరసారాలు వేసుకుంటున్నారు. పోలైన ఓట్లు, వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయనే ఆలోచనల్లో ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన రోజు నుంచి మండలంలో ఏ నలుగురు గుమిగూడిన స్టేట్‌లో ఏ పార్టీ వస్తుంది, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పరిస్థితి ఏమిటనే మాటలు తప్పితే మరో మాటల్లేవు. గంటకు నాలుగు టీలు తాగి కూర్చున్న చోటు నుంచి లేయకుండా పేపర్లు తిరగేస్తూ రాజకీయాలను మాట్లాడుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, టీస్టాల్, బస్టాండ్, హోటళ్లు, కార్యాలయాలు, దుకాణ సముదాయాలతో పాటు ఉపాధి పని ప్రదేశాలు, చెట్ల నీడలు, రచ్చబండ వద్ద ఎక్కడ చూసినా ఒక ప్రధాన పార్టీ గెలుస్తుందని, లేదు మరో పార్టీనే గెలుస్తుందని చర్చించుకుంటున్నారు. తొలి నుంచి అక్కడ పార్టీకి బాగుండేది చివరిరోజు మారిందని కొందరు, లేదు ఒక పార్టీకి అక్కడ సాలిడ్‌గా పడిపోయిందని కొందరు, అక్కడ ఏజెంట్లే లేదంటే ఫుల్‌గా ఓట్లు వేసేశారంటూ ఎవరికి తోచిన విధంగా వారు చెప్పేస్తూ చర్చించుకున్నారు. కొందరు చెప్పేది అయితే వీరు ఓటింగ్ మిషన్ పక్కనే నిలబడి చూశారా? అనే స్థాయిలో ఉంటోంది. దీంతో పాటు కొంత రాజకీయాల మీద ఆసక్తి ఉన్నవారు మీ నియోజకవర్గంలో ఎలా ఉంది? ఎవరు గెలుస్తారని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారి బంధువులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. కొందరు నాయకులు చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు తదితర అంశాలపై అంచనాలు వేసుకుంటున్నారు. ఎంత చర్చించుకున్నా చివరకు చూద్దాం జూన్ 4వ తేదీ తెలిసిపోతుంది ప్రజలు ఏ వైపు వేశారో అంటూ ముగించేస్తున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతమ్మ

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆలూరు క్లస్టర్ ఏపీడీ పద్మావతమ్మ ఆదేశించారు. ఆమె శుక్రవారం ఆలూరులో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు కలిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ శ్రీనివాసులు, టీసీ, ఈసీ, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

దేవనకొండ: మండలంలోని దేవనకొండ, తెర్నెకల్ గ్రామాల్లోని విత్తన దుకాణాలను శుక్రవారం పత్తికొండ ఏడీఏ విజయ్‌మోహన్, ఏఓ సురేష్‌బాబు తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన, ఎరువుల నిల్వలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సీడ్ లైసెన్స్ ఉన్నవాళ్లు మాత్రమే పత్తి విత్తనాలను అమ్మాలన్నారు. కంపెనీకి సంబంధించిన సోర్స ఆఫ్ సర్టిఫికెట్ లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. బిల్స్ తప్పకుండా వేయాలని, రిటైల్ టు రిటైల్‌గా పత్తి విత్తనాలు అమ్మకూడదన్నారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. మండలంలో మే నెలలో వర్షపాతం 44 సెం.మీ. గానూ 35 సెం.మీ. వర్షపాతం కురిసిందన్నారు. జూన్‌లో పంటలను సాగు చేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు.

కోసిగిలో మోస్తరు వర్షం



రైల్వే గేటు సమీపంలో జలమయమైన రోడ్డు

కోసిగి: మండలంలో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఖరీఫ్ ప్రారంభం గాకమునుమే ఈనెల 13వ తేదీ, 17వ తేదీన వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. మొన్నటివరకు వడగాల్పులు, ఎండ తీవ్రతకు తట్టుకోలేక ప్రజలు తల్లడిల్లిపోయారు. ఒక్కసారిగా వర్షాల రాకతో వాతావరణంలో మార్పులు వచ్చాయి. శుక్రవారం తెల్లవారుజామున మంత్రాలయం నియోజకవర్గంలో మంత్రాలయంలో 49.66 మి.మీ, కౌతాళంలో 42.06 మి.మీ, కోసిగిలో 22.08 మి.మీ, పెద్దకడబూరు 10.12 మి.మీ వర్షపాతం నమోదైంది. కోసిగిలో వర్షం రాకతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వైఎస్సార్ సర్కిల్, రైల్వే గేటు, సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణంలోని రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గోనెగండ్లలో 25.4 మి.మీ వర్షం

గోనెగండ్ల: గత మూడు రోజులుగా మండలంలో మోస్తారు వర్షం కురుస్తోంది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందే ప్రారంభమైందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత సోమవారం కురిసిన వర్షానికి కొంతమంది రైతులు తమ పొలంలో దుక్కులు దున్నుకున్నారు. అలాగే శుక్రవారం తెల్లవారుజామున 25.4 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. శుక్రవారం కురిసిన వర్షానికి హెచ్.కైరవాడి, అలువాల, కులుమాల తదితర గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, వ్యవసాయ పనులు మొదలు పెట్టవచ్చని రైతులు పేర్కొంటున్నారు.



పొలంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



మూగలదొడ్డిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

కోసిగి: మండలంలో శుక్రవారం తెల్లవారుజామన కురిసిన గాలివానకు 22 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ట్రాన్స్‌కో ఏఈ వీరేష్ తెలిపారు. మండలంలోని మూగలదొడ్డి, వందగల్లు, కోసిగి, పల్లెపాడు గ్రామాల్లోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మూగలదొడ్డి గ్రామంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించే పనిలో పడ్డారు.

హత్యాయత్నం కేసులో టీడీపీ నాయకుల అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామంలో ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేసిన కేసుకు సంబంధించి టీడీపీ నాయకులను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్‌కు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఓ స్థలం విషయంలో ఉన్న సమస్యను ఇరువురు కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అనుకూలంగా ఇవ్వడంతో ఈ స్థలంలో కొట్టాలను వేసుకుంటున్నారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ నాయకుడు ప్రకాష్‌గౌడ్ డోన్ నుంచి కొందరిని పిలిపించి దాడులకు పాల్పడడంతో బాధితులు ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి నిందితులు ప్రకాష్‌గౌడ్, తిలక్‌కుమార్‌గౌడ్, చిన్నరాముడు, చాకలి నాగరాజు, చాకలి శ్రీనివాసులు, చాకలి ఆనంద్, మంగళి హరికృష్ణను చిట్యాల గ్రామ శివారులోని ముక్కల కొండ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరికొంత మందిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని, దాడికి ఉపయోగించిన రెండు జేసీబీలను, పట్టుడు కట్టేలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.